# ఖుర్‌ఆన్

24

## అభ్యంతరాలు, వాస్తవికత

Qur'an- Eiterazat Aur Haqeeqat
(Telugu)

# ఖుర్‌ఆన్
## అభ్యంతరాలు, వాస్తవికత

ఎస్.ఎమ్. మలిక్

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**Qur'an- Abhyantaraalu Vaastavikata**
Qur'an- Eiterazat Aur Haqeeqat (**Telugu**)

TIP Series. No. **129**

Written by : S.M. Mallick

All Rights Reserved with the Publishers

Second Edition : November 2012

Copies : 2000

**Price : Rs. 15**

ISBN : 81 - 88241 - 25 - 3

Published by **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad - 500 002. India.
Phone: 0091 - 040 - 24564583
Fax : 0091- 040 - 24576237
E-mail: tiphyderabad@rediffmail.com
Website: www.teluguislamiclit.org

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# మా మాట

ఏప్రిల్ 2004లో ఒక లేఖ ఆలిండియా రేడియో ద్వారా ఎస్.ఎమ్. మలిక్ పేర వచ్చింది. అది డా.టి.హెచ్. చౌధరీ వ్రాసింది. రేడియోలో 'ఖుర్ఆన్ విశిష్టత'ను గురించి శ్రీ మలిక్ ప్రసంగం విని వ్రాశారాయన. తన లేఖతో పాటు ఒక పుస్తకంలోని కొన్ని పేజీల ఫోటో కాపి పంపించారు. కల్కత్తా హైకోర్టులో ఖుర్ఆన్‌కు వ్యతిరేకంగా వేసిన పిటిషన్‌కు సంబంధించిన పుస్తకమది. అందులో ఖుర్ఆన్ ఆయత్‌లు కొన్ని ప్రస్తావించబడ్డాయి. ఆ ఆయత్‌లు తనకు 'బాధ' కలిగించాయని శ్రీ చౌధరీ అభిప్రాయపడుతూ వాటికి సరయిన భావాన్వయం బహిరంగంగా ప్రకటించవలసిందని కోరారు. శ్రీ మలిక్ ఇతరత్రా నిమగ్నులయి ఉన్నందువల్ల సకాలంలో దానికి బదులివ్వడం జరగలేదు. డా. చౌధరీకి పంపిన సమాధానమే 'బహిరంగం'గా ప్రకటించాలన్న ఆయన కోరిక మేరకు గీటురాయిలో ప్రచురించాము, ఇప్పుడు దాన్నే పుస్తక రూపంలో ప్రచురిస్తున్నాము.

డా. టి.హెచ్. చౌధరీ పేరుగన్న సాంకేతిక శాస్త్రవేత్త. లోగడ అనేక ప్రభుత్వ శాఖల్లో, భారత దేశంలోనూ, విదేశాలల్లోనూ ఉన్నత పదవులనలంక రించిన మేధావి. ప్రస్తుతం "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అడ్వైజరు"గా సేవలందిస్తున్నారు. ఆరెస్సెస్ ఆధ్వర్యాన నడపబడే 'ప్రజ్ఞాభారతి' అనే శాస్త్రీయ అధ్యయన కేంద్రానికి చెయిర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయనతోపాటు ఒకసారి 'ప్రతిధ్వని' (ఈటివి కార్యక్రమం)లో పాల్గొనే అవకాశం శ్రీ మలిక్‌కి దొరికింది. జమాఅత్ నిర్వహించిన ఒక సింపోజియంలోనూ ఆయన పాల్గొన్నారు. ఆయన సుహృదయుడు, స్నేహశీలి.

– ప్రకాశకులు

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడయిన అల్లాహ్ పేరుతో

# ఖుర్ఆన్

## అభ్యంతరాలు, వాస్తవికత

ఖుర్ఆన్‌లోని ఆయత్‌లయినా, ఇస్లామ్‌కు సంబంధించిన మరే విషయమయినా అర్థం కాకపోతే తెలుసుకునేందుకు ప్రశ్నించడమూ, ఒక స్థాయిలో అభ్యంతరం వెలిబుచ్చడమూ సరయినదే, ఇందులో తప్పులేదు. కాని సాధారణంగా దివ్యఖుర్ఆన్ పట్ల ప్రకటించే అభ్యంతరాల వెనక సత్యాన్వేషణ, జిజ్ఞాసకన్నా ఇస్లామ్‌ను, ముస్లిములను అప్రదిష్టపాలు చెయ్యడం, అపార్థాలకు గురి చెయ్యడం ఉద్దేశమయి ఉంటుంది. అందువల్ల గ్రంథం చెప్పే మాటలకు తమకు ఇష్టమయిన అర్థాలు ఆపాదించడం జరుగుతుంది. ఈ ఉద్దేశంతో మాటలాడే వారు, వ్రాసే వారు అనువాదమూ తప్పుగా చెయ్యడానికి వెరువరు. ఖుర్ఆన్ వచనాలను వాటి పూర్వాపరాల నుండి వేరుచేసి, సందర్భానికి పొంతన లేకుండా అర్థాలు తీస్తారు. ఇది ఎంతమాత్రం సమంజసమయిన, న్యాయమయిన పద్ధతి కాదు.

ఏ ధార్మిక గ్రంథాన్నయినా, ఆ మాటకువస్తే ఏ గ్రంథాన్నయినా అలా అధ్యయనం చెయ్యడం నీతి నిజాయితీకి విరుద్ధమయిన విషయం. ఒక గ్రంథంలో నుంచి ఏదయినా ఒక వాక్యాన్ని లేక కొన్ని వాక్యాలను సందర్భానికీ, పూర్వోత్తరా ప్రస్తావించిన విషయాలకూ, రచయిత ఉద్దేశానికీ, రచన ఆశయానికీ భిన్నమయిన రీతిలో అన్వయింపజేయడం, ఎంతసేపటికీ న్యాయమనిపించుకోదు, ఇది ఆసాంతం దురుద్దేశ్యంతో కూడుకున్న వైఖరి. కొన్ని వర్గాలు పనికట్టుకుని ఖుర్ఆన్ పట్ల ఇస్లామ్ పట్ల ఎంతో పటిష్టంగా, సుసంఘటితంగా దుష్ప్రచారం చేయాలని పూనుకున్నారు. ఇటువంటి వైఖరి నవలంబించే వారు మొండివారని ప్రకటిస్తూ, హిందూ మతంలో పేరుగన్న విద్వాంసులు స్వామి దయానంద సరస్వతిగారు తన రచన 'సత్యార్థప్రకాశ్'ను గురించి చెబుతూ ఇలా అన్నారు: "ఎవరీ గ్రంథకర్త యొక్క తాత్పర్యమునకంటే విరుద్ధమగునభిప్రాయముతో జూతురో వారి కభిప్రాయ మేమియుఁ దేటపడఁ జాలదు... దేని కొరకు వక్త శబ్దుచ్చారణను జేసెనో లేఖను

లిఖించెనో దానితో నావచనములను, ఆ లేఖను గూర్చుట 'తాత్పర్యము.' ఈ విషయములందు ధ్యానముంచి యే పురుషుడు గ్రంథమును జదువునో అతనికి గ్రంథాభిప్రాయము యథాయోగ్యముగ విశదము కాగలదు. హఠలును దురాగ్రముమనగు ననేకులు వక్తయొక్క యభిప్రాయమున కంటే విరుద్ధాలగు దానిని దాము కల్పించుకొందురు."◆

ఏదయినా రచనను అర్థం చేసుకునేందుకు ఏదో వాక్యాన్ని, వాక్యంలో పదాలను, పదాల బాహ్య అర్థాన్నిమటుకే పరిశీలించడం జరగదు, సరయిన భావం నిర్ణయించడానికి ఆ మాట పూర్వాపరాలను, పూర్వోత్తర సందర్భాన్నీ దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. అవసరమయితే ఆ గ్రంథజ్ఞానమున్న పండితుల్ని సయితం సంప్రదించవలసి ఉంటుంది. ఈ కారణంగానే ధార్మిక గ్రంథాలకు వ్యాఖ్యానాలు వ్రాశారు ఆయా గ్రంథాల పండితులు, ధర్మవేత్తలు. ఏ పండితుడు వ్రాసినా తన అధ్యయన పరిశోధన, అవగాహనల దృష్ట్యా భిన్న మయిన భావం గ్రహించడం సంభవమే. అందువల్లనే వేదాలకయినా, ఖుర్ఆన్ కయినా, ఇతర మత గ్రంథాలకయినా అనేక అనువాదాలు, వ్యాఖ్యానాలు ఉనికిలోకి వచ్చాయి. ఉదాహరణగా వేదాల అనువాదాల నుండి, గీత అనువాదాల నుండి అనేక విషయాల ప్రస్తావించవచ్చు.

దివ్యఖుర్ఆన్‌ని గురించి అభ్యంతరాలు తెలిపేసోదరులకు నేను ఒక విషయం విన్నవించుకో దలిచాను. సత్యానికి మీరు ఏమాత్రమయినా విలువనిచ్చేవారయితే, నిజంగానే మీరు వాస్తవికతను తెలుసుకోగోరే వారయితే కాస్త ఈ మనవిని ఆలకించండి. మీరు దయచేసి ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) జీవిత చరిత్రను అధ్యయనం చెయ్యండి, దివ్యఖుర్ఆన్ అనువాదాన్నీ పూర్తిగా చదవండి, ప్రవక్త మహనీయుల బోధనల్ని (హదీసుల్ని) కొన్నింటినయినా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి. తద్వారా దైవగ్రంథ మయిన దివ్యఖుర్ఆన్ ఉద్దేశం, దైవసందేశహరులు ముహమ్మద్ (స) జీవిత ధ్యేయం, ఆయన బోధనల లక్ష్యం ఏమిటో గ్రహించి మీరే ఒక నిర్ణయానికి రండి, మీరు ఎటువంటి నిర్ణయానికి వచ్చినా అది మీ ఇష్టం, దానికి మీరు స్వతంత్రులు.

---

◆ సత్యార్థప్రకాశము – తెలుగు అనువాదము – ఆర్య ప్రతినిధి సభ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు, 1986 ప్రచురణ.

ప్రవక్త (స) జీవితం, ఆయన బోధనలు, దివ్యఖుర్ఆన్ అధ్యయనం వల్ల మీరు ఒక విషయాన్ని మటుకు తప్పక గ్రహిస్తారు. ఏది ఏమయినప్పటికీ ఈ అధ్యయనం వల్ల ఇస్లామ్ లక్ష్యం ప్రపంచంలో న్యాయం, సత్యం ఆధారంగా ఒక సమగ్ర జీవనవ్యవస్థను, ఒక సత్సమాజాన్ని స్థాపించడం అన్నది మీకు ద్యోతకమవుతుంది. మనుషులను మంచి మానవులుగా మలచడం, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం, వారికి వాస్తవమయిన సుఖశాంతులు, ఉభయలోకాల సాఫల్యం ప్రాప్తించేందుకు అవసరమయిన వ్యవస్థను నెలకొల్పడం ఇస్లామ్ ధ్యేయమన్నది స్పష్టమవుతుంది. ఇస్లామ్ ప్రకటించే ఈ వాదనను మీరు నమ్మతించినా నమ్మతించకపోయినా, దాని ధ్యేయం మటుకు ఇదే అని అంగీకరిస్తారు. అప్పటికీ ఇస్లామీయ బోధనల్లో కంటకప్రాయమయిన అంశాలు కొన్ని మీకు గోచరించవచ్చు. కాని ఈ సందర్భంలో మీ ఆలోచన మరో విధంగా ఉంటుంది. అదొక సత్యాన్వేషి దృష్టిగా మారుతుంది, ప్రత్యర్థిభావం అందులో ఏ కోశానా కానరాదు.

ఒక ఉదాహరణ, మీరు ఒక టీచరు అనుకుందాం. ఒక విద్యార్థిని ఏదో తప్పు చేసినందుకు మీరు శిక్షిస్తున్నారు. ఈ దృశ్యాన్ని ఒక అపరిచితుడు గమనిస్తాడు. మీరు టీచరన్న విషయం అతనికి తెలియదు. ఎవరో ఒక వ్యక్తి ఒక బాలుణ్ణి శిక్షించడం మటుకే అతను గమనించాడు. ఇతను మీ చేష్టను తీవ్రంగా ఖండనీయమని భావిస్తాడు. తనకు వీలయిన ప్రతిచోట దాన్ని చెప్పి ఖండిస్తాడు కూడా. ఒక దుర్మార్గుడు ఓ అమాయక బాలుణ్ణి శిక్షించడం కళ్ళారా చూశానని, అది అతి దుర్భరమయిన ఉదంతమని బాధవెళ్ళగ్రక్కుతాడు. కాని ఆ శిక్షించే వ్యక్తి ఉపాధ్యాయుడని, బాలుడు విద్యార్థి అని, అతను ఫలానా తప్పు చేశాడని అతనికి తెలియగానే అతని వైఖరిమారిపోతుంది. ఆ చర్య అతనికి పూర్తిగా సమ్మతం కాకపోయినా దాన్ని తీవ్రంగా తీసుకోడు. అంతే, ఒకే సంఘటన పట్ల పూర్వాపరాలు తెలియని పక్షంలో మనిషిలో కలిగే భావపరిణామానికీ అవి తెలిసిన తరువాత అతనిలో కలిగే ప్రతిస్పందనకూ భూమ్యాకాశాలంత తేడా ఉంటుందన్నమాట.

ఇటువంటి ఉదాహరణలు అసంఖ్యాకంగా మన ముందుకు వస్తుంటాయి. కారాగారాల్లో లెక్కలేనన్ని బాధలను భరిస్తున్నారు జనం. ఉరికంబాలపైకి

ఎందరినో ఎక్కిస్తుంటారు. పోలీసులు చితకబాదుతున్న వివరాలు మన ముందుకువస్తాయి. ఎన్‌కౌంటర్ల కథలు వినిపిస్తుంటాయి. సైనికులనబడేవారు మానవులను కాల్చిబూడిద చేసే ఘటనలు చూస్తుంటాము. పాలనా పరంగా ఎన్నెన్నో ఆగడాలు ప్రజలపై జరుగుతున్నట్లు కానవస్తుంది. అయినా మనం పల్లెత్తుమాట అనము. జైళ్ళల్లో వందలాది జనాన్ని ఎందుకు క్రుళ్ళజేస్తున్నారని ఎవరూ ప్రశ్నించరు. హంతకులను కాల్చి చంపినా ఉరికంబానికెక్కించినా ఎవరూ పట్టించుకోరు. ఈ 'హింస'ను గురించి అడిగే వాడెవడూ ఉండడు. కలహ ప్రియులను, కలతలు రేపేవారిని, దేశ సరిహద్దులను అతిక్రమించేవారిని– రకరకాల మానవ శ్రేణుల్ని నిర్దయగా, నిర్దాక్షిణ్యంగా చంపుతుంటారు రక్షక భటులు. 'మానవుల'పై ఈ "అత్యాచారం" హింసా సాగుతూ ఉన్నా మనం ప్రశ్నించం. ఎందుకంటే మనకూ తెలుసు– ఇలా శిక్షించడం మనకు ఎంతో ఇష్టంకాని పని అయినా, గుండెను బండబార జేసుకుని చేసే పని అయినా– భువిలో కల్లోలాన్ని రూపుమాపేందుకు, శాంతిని, నెమ్మదిని సుస్థిర పరిచేందుకు, న్యాయాన్ని, నీతిని, నిజాయితీని నిలుపేందుకు ఇది తప్పదని. ఒక బృహత్తర లక్ష్యం కోసం ఇది అనివార్యమని మనం ఏకగ్రీవంగా అంగీకరిస్తాము. కారణం, దీనివెనుకనున్న హేతువు మనకు తెలుసుకాబట్టి. ఆ హేతువు తెలియకపోతే తెలుసుకోవడమే న్యాయవంతమయిన వైఖరి. అలాకాక పైన ఉదాహరించిన ఘటనలన్నింటినీ అన్యాయమని, అత్యాచారమని, దౌర్జన్యమని, దుర్మార్గమని అభివర్ణిస్తే నవ్విపోతారు జనం.

ఇదే సూత్రాన్ని ఉపయోగించి దివ్యఖుర్ఆన్‌లోని కొన్ని ఆయత్‌లను, మీరు (కాదు, కొందరు అపార్థాలకులోనయినవారు లేక అపార్థాలను సృష్టించ గోరినవారు) పేర్కొన్న వాటిని, అందులోని బోధనలను పరిశీలించి చూడండి, మీ 'బాధ' దానంతటఅదే దూరమయిపోతుంది.

దివ్యఖుర్ఆన్ ఉద్దేశ్యం మానవునికి ఇహపరలోకాలలో సాఫల్యాన్ని చేకూర్చడం. సమాజంలో అన్ని విధాల న్యాయాన్ని నెలకొల్పడం, శాంతియుత వాతావరణాన్ని సృష్టించడం. మానవులు ఈ మహత్తర ఉద్దేశాలను సాధించగలిగే సిద్ధాంతాలను, సూత్రాలను, నియమాలను అందజేయడం. ఎందుకంటే ఖుర్ఆన్ మానవుల సృష్టికర్త, స్వామి, ప్రభువు, పోషకుడయిన దైవం, మానవుల పరమ

హితైషి పంపిన గ్రంథం. ఇది మానవ జీవితం మొత్తానికి, పుట్టినప్పటి నుంచి గిట్టేవరకు అన్ని దశల్లోనూ దారిచూపుతుంది. ఆధ్యాత్మిక, నైతిక, వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలన్నింటికీ మార్గదర్శకత్వం వహిస్తుంది. సాధారణ దినసరి పరిపాలనా వ్యవహారాలు మొదలుకుని భద్రత, రక్షణ, శాంతిస్థాపన, యుద్ధం, సంధి, ఇత్యాది వ్యవహారాలూ దీని పరిధి లోపలే ఉన్నాయి. దివ్యఖుర్‌ఆన్‌లోని మార్గదర్శక సూత్రాలను ఈ పూర్వరంగంలో పరిశీలించడమే సరయిన పద్ధతి. అలా పరిశీలించినప్పుడు సర్వం ప్రస్ఫుటమయి పోతుంది.

ప్రస్తావిత పేజీల ఫోటో కాపీలో దివ్యఖుర్‌ఆన్‌లోని 24 ఆయత్‌ల ఆంగ్ల అనువాదాన్ని విభిన్న సూరాల నుంచి ఎన్నుకుని పేర్కొనడం జరిగింది. ఈ అనువాదం ఎక్కడి నుంచి గ్రహించిందీ అందులో వ్రాయలేదు. (అసలు పుస్తకంలో అది ఉండవచ్చు). నేను ఆ అనువాదం ప్రామాణికతను ప్రశ్నించబోను. అది ప్రామాణికమయిన అనువాదమే కావచ్చు. ప్రస్తుతం నేను అనువదిస్తున్న 'తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్' (ఖుర్‌ఆన్ అవగాహనం)లోని తెలుగు అనువాదాన్ని మాత్రమే ఈ సమాధానంలో పేర్కొంటాను. పైన ప్రస్తావించిన ఆయత్‌లను పేర్కొన్న తరువాత రచయిత లేక కోర్టులో పిటిషనర్ ఇలా వ్రాశాడు:

"ఇవేకాక ఇటువంటివే అసంఖ్యాకమయిన వేరే ఆయత్‌లున్నాయి. ఇక్కడ మేము కేవలం ఇరువయి నాలుగు ఆయత్‌లను మాత్రమే పేర్కొన్నాము. ఈ ఆయత్‌లు ఇచ్చే ఆదేశాలు శత్రుత్వాన్ని, వైషమ్యాన్ని, విద్వేషాన్ని, వంచనను, మోసాన్ని, ఉద్రిక్తతను, లూటీని, హత్యను ప్రోత్సహిస్తున్నాయన్నది సుస్పష్టం. ఈ కారణంగానే ఈ దేశంలోనూ, ఇంకా (మిగతా) ప్రపంచంలోనూ ముస్లిములూ ముస్లిమేతరుల మధ్య కల్లోలాలు జరుగుతున్నాయి.

"పైన పేర్కొన్న దివ్యఖుర్‌ఆన్‌లోని ఇరువయి నాలుగు ఆయత్‌లలో ముసల్మానులు, ఇతర విశ్వాసాలను అనుసరించే వారికి వ్యతిరేకంగా పోరా డేందుకు ఆదేశించబడ్డారు. ఈ ఆయత్‌లను (ఖుర్‌ఆన్ నుండి) తొలగించనంత వరకు ఈ దేశంలో కల్లోలాలు ఆపడం సాధ్యం కాదు."

(ఆంగ్లం నుండి అనువాదం)

ఇంతకుముందు విన్నవించుకున్నట్లు ఖుర్‌ఆన్ యావత్ మానవాళిని సంబోధిస్తుంది. అందరూ కలసి తమ నిజకర్త, స్వామి, ప్రభువు దాస్యాన్ని పాటించాలని, ఆయన్నే ఆరాధించాలని బోధిస్తుంది. అలాగే సకల మానవాళి ఒకే తల్లిదండ్రుల సంతానమవడం చేత పరస్పరం సోదరులని చాటుతుంది. అది తన అనుయాయుల్ని, తమ సోదరులయిన తోటి మానవులపట్ల ఏ విధమయిన అన్యాయానికీ పాల్పడరాదని ఆదేశిస్తుంది. వారి ఎడల పూర్తిగా ఉత్తమరీతిలో వ్యవహరించవలసిందని, న్యాయంగా ప్రవర్తించవలసిందని శాసిస్తుంది. దైవాన్నీ, ప్రళయదినాన్నీ నమ్ముతున్నట్లు నటిస్తూ అసలు నమ్మని వారిని గురించి చెబుతూ ఖుర్‌ఆన్ స్పష్టంగా చెబుతుంది:

> **'అవనిలో కల్లోలాన్ని రేకెత్తించకండి" అని వారికి చెప్పినప్పుడల్లా వారు, "మేమయితే అంతా చక్కదిద్దేవారమే" అని అంటారు, జాగ్రత్త! వాస్తవానికి వీరే కల్లోలాన్ని సృష్టించేవారు, కాని వారు గ్రహించటం లేదు.**
> **(బకర : 11,12)**

> **అల్లాహ్ నీకు ప్రసాదించిన ధనంతో పరలోక గృహం కట్టుకునే ఆలోచన చెయ్యి. మరి ప్రపంచంలోనూ నీ వాటాను మరచిపోకు. అల్లాహ్ నీకు మహోపకారం చేసినట్లే నీవు పరోపకారం చెయ్యి. భువిలో కల్లోలం రేకెత్తించే ప్రయత్నం చెయ్యకు. నిశ్చయంగా అల్లాహ్ కల్లోల జనకులను ఇష్టపడడు.**
> **(అల్ కసస్ : 77)**

ఖుర్‌ఆన్ ఆయత్‌లను వాటి సందర్భానికి దూరం చేసి భావాన్ని మార్చేవారిని ప్రస్తావిస్తూ దివ్యఖుర్‌ఆన్ ఇలా అంటుంది:

> వీరు అబద్ధం వినేవారు, అధర్మమయిన సొత్తును తినేవారు. అయినా నీ వద్దకు వీరు (తమ వ్యాజ్యాలు) తీసుకువస్తే వాటికి నీవు తీర్పు చెప్పినా, నిరాకరించినా అది నీ ఇష్టం, నీకు ఆ స్వేచ్ఛా ఉంది. నిరాకరించినా వీరు నీకు ఏ హానీ చెయ్యలేరు. తీర్పు చెప్పేమాటయితే సరిగ్గా, న్యాయవంతంగా చెయ్యి. అల్లాహ్ న్యాయం చేసే వారినే ఇష్టపడతాడు.
> (అల్ మాఇద : 42)

ఖుర్ఆన్ శత్రువుల ఎడలనూ న్యాయంగా వ్యవహరించమంటుంది.

**విశ్వసించిన జనులారా, అల్లాహ్ ప్రీతికొరకు నిజాయితీపై నిలకడ గలవారయి, న్యాయానికి సాక్ష్యం పలికేవారయి మెలగండి. ఒక వర్గం పట్ల శత్రుత్వం మిమ్మల్ని ఆగ్రహానికి గురిచేసి న్యాయ విరుద్ధంగా ప్రవర్తింపజేయరాదు. న్యాయం చేయండి, ఇది దైవభక్తిపరాయణతకు సముచితమయిన వైఖరి. (అల్ మాఇద : 8)**

అలాంటిది ఖుర్ఆన్ విద్వేషాన్నీ వైషమ్యాన్నీ ఆదేశిస్తుందా? పైగా ఇస్లామీయ రాజ్యంలో సేనకు ఇవ్వబడిన కొన్ని ఆదేశాలను సామాన్య మానవులకు ఇచ్చినట్లు భ్రమ కలిగించేలా కల్కత్తా కేసులో చూపడం జరిగింది. పూర్వాపరాలను వివరంగా చూస్తే ఇది స్పష్టంగా బోధపడుతుంది. ఆ పేర్కొన్న ఆయత్‌ల అనువాదం సందర్భానికి దూరంగా ప్రస్తుతపరచడం ద్వారా ఏ విధంగానయినా సరే, వారు నిరూపించదలచిందే మిటంటే–

- ఖుర్ఆన్ ముస్లిములను ముస్లిమేతరులతో పోరాడమని, వారిని చంపమని, వారి ఎడల కఠినంగా ప్రవర్తించమని ఆదేశిస్తుంది.
- ముస్లిములు, ముస్లిమేతరులతో స్నేహం పెంచుకోవడాన్ని అది నిషేధిస్తుంది.
- ఇస్లామ్‌ను తిరస్కరించిన వారు నరకంలో ప్రవేశిస్తారని అది ప్రకటిస్తుంది.

ప్రస్తావించే ఆయత్‌లపై అభ్యంతరాలను పరిశీలించే ముందు వాస్తవంగా ఖుర్ఆన్ బోధనలేమిటో స్థూలంగానయినా పరిశీలించడం అవసరమని భావిస్తున్నాను.

మానవుల పక్షాన ఖుర్ఆన్ ప్రాధాన్యతల్ని ముందు పరిశీలిద్దాము.

1. ఖుర్ఆన్ బోధనలు మానవ స్వేచ్ఛకు అద్దంపడతాయి, దానికి ప్రాముఖ్యాన్నిస్తాయి.
2. ఖుర్ఆన్ సమస్త మానవుల్ని తమ సృష్టికర్త, పోషకుడు, పాలకుడు ఏకైక స్వామి అయిన దైవానికి కృతజ్ఞులయి, విధేయులయి జీవించాలని కోరుతుంది, దానికి దారి చూపుతుంది.

3. మానవుల సన్మార్గదర్శనానికి దైవం తన గ్రంథాలను, వాటిని ఆచరించి ఆదర్శం నిలిపే ప్రవక్తల్ని పంపాడని, వారిని అనుసరించడమే మానవుల ఇహపరాల సాఫల్యానికి మార్గమని చాటుతుంది. ఇస్లామ్ అంటే దైవ విధేయత, దైవానికి స్వయం సమర్పణ.

4. మనిషి జీవితం విశ్వంలోనే విశిష్టమయినదని, మానవుని కొరకే దైవం తన మార్గదర్శకత్వం పంపాడని అంటుంది. ఈ జీవితంలో దాన్ని అనుస రించడం వల్ల మానవుడు దైవానికి ప్రీతిపాత్రుడవుతాడని అలాకాని పక్షంలో ఆగ్రహపాత్రుడవుతాడని ప్రకటిస్తుంది. ఈ జీవితం ముగిసిన తరువాత మానవుడు మరో జీవితాన్ని పొందుతాడని, రేపటి ఆ జీవితంలో నేటి ఈ జీవితంలోని నడత ఆధారంగా ఫలాలను అనుభవించవలసి ఉంటుందని, అక్కడ దేవుని ప్రీతిపాత్రులయినవారు స్వర్గవాసు లవుతారు, ఆగ్రహపాత్రులయినవారు నరకవాసు లవుతారని ప్రకటిస్తుంది.

5. ఎవరయితే ఈ సత్యాలను అంగీకరించి దైవమార్గ బోధనను స్వీకరించి దైవప్రవక్తల్ని అనుసరిస్తారో వారిని ఖుర్ఆన్, ముస్లిములు (అంటే దైవవిధేయులు) అని పిలుస్తుంది; మరెవరయితే ఈ బోధనల్ని తిరస్క రించి, దైవాదేశాలను, దైవప్రవక్తల్నికాదని మరెవరి ఆదేశాలనయినా పాటించి, మరెవరి ఆదర్శాన్నయినా అనుసరిస్తారో వారిని 'కాఫిర్' అని అంటుంది. 'కాఫిర్' అంటే కృతఘ్నుడు, తిరస్కారి, అవిధేయుడు, ఖుర్ఆన్ పట్ల, దాని బోధనల పట్ల విశ్వాసం లేనివాడు, నాస్తికుడు అని అర్థం. ఇస్లామ్‌ను విశ్వసించేవారికీ విశ్వసించనివారికీ మధ్యన భేదాన్ని తెలుప డానికే ఈ పదప్రయోగం.

ఈ మౌలిక బోధనల్ని సదా దృష్టిలో ఉంచుకోవడం అవసరం.

దివ్యఖుర్ఆన్‌లో మనిషికి ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గురించి ఒకచోట ఇలా ప్రకటించడం జరుగుతుంది:

> **మేము అతనికి (మానవునికి) రుజుమార్గమయితే చూపాము. ఇక కృతజ్ఞతతో విధేయుడయినా, లేక సత్యాన్ని తిరస్కరించి అవిధేయు డయినా అది అతని యిష్టం.** **(అద్దహ్ర్ : 3)**

**(భువిలో ఎల్లరూ విశ్వాసులు, విధేయులే కావాలని) నీ ప్రభువు కోరుకున్నట్లయితే భూమిపై నివసించే వారందరూ విశ్వసించి ఉండే వారు. అలాంటప్పుడు నీవు విశ్వాసులే అవ్వాలని అందరినీ బలవంతం చేస్తావా? (యూనుస్ : 99)**

ఇదే విషయాన్ని ఇలా చాటడం జరిగింది:

**ధర్మావలంబనలో ఎటువంటి బలాత్కారం లేదు. (బకర : 256)**

**అదేమీకాదు, ఇది (ఖుర్ఆన్) జ్ఞాపిక, సన్మార్గ ప్రస్తావన. ఇక ఇష్టమయిన వారు దీని ద్వారా సన్మార్గాన్ని పొందవచ్చు. (ముద్దస్సిర్ : 54,55)**

ఈ ఆయత్ల ద్వారా స్పష్టంగా బోధపడుతోంది – మనిషికి తన జీవితంలో ఎటువంటి వైఖరి నవలంబించడానికయినా స్వేచ్ఛ దైవికంగానే ప్రసాదించబడిందని. ఖుర్ఆన్ బలవంతాన ఏ వ్యక్తినయినా ఏ జాతినయినా దైవవిధేయులు (ముస్లిములు) కావాలని కోరదు. అలా బలవంతం చెయ్యడాన్ని ఖుర్ఆన్ అనుమతించదు కూడా. మనిషి తన ఇష్టపూర్వకంగా, అంతరాత్మననుస రించి అవలంబించినదే వాస్తవానికి అతని ధర్మం, జీవన విధానం. ఎవరయినా స్వయంగానే దైవం చూపిన బాటను అనుసరించరాదని నిర్ణయించుకుంటే, తానే ఇచ్చిన ఆ స్వేచ్ఛను హరింపజేయడం అల్లాహ్కు సుతరామూ ఇష్టం లేదు.

యుద్ధం, పోరాటాలకు సంబంధించిన ఆదేశాలన్నీ ఇస్లామీయ రాజ్యం లోనే అమలులోకి రాగలవు. ఈ ఆదేశాలు ఇస్లామీయ ప్రభుత్వానికే వర్తిస్తాయి. అక్కడ కూడా ఖుర్ఆన్ ముస్లిమేతరులందరితో పోరాడమంటుందనడం సత్య దూరమయిన విషయం. అదే నిజమయితే ఇలా ఎందుకు ఆదేశిస్తుంది:

**మీతో పోరాడే వారితోనే మీరూ దైవమార్గంలో పోరాడండి. అయితే మితిమీరకండి- అల్లాహ్ మితిమీరే వారిని ఇష్టపడడు. (బకర : 190)**

ఇది గమనార్హమయిన విషయం. అది ముస్లిమేతరులందరితో పోరాడ మనడం లేదు. ఇస్లామీయ రాజ్యంపై కయ్యానికి కాలుదువ్వే వారితో పోరాడటానికి సమాయత్త మవమంటుంది. అంతేకాదు అది తన సేనకు ఇచ్చే ఆనతిలో 'దైవమార్గంలో' అని నిర్బంధిస్తుంది. అంటే సత్యం, ధర్మం, న్యాయం కోసమే

పోరాడాలని అంటుంది. అవసరమయిన చోటనే, అవసరమయిన మేరకే శక్తి నుపయోగించమంటుంది, అనవసరంగా శక్తినీ వినియోగించరాదు, ప్రత్యర్థులపై దెబ్బతీయడంలో హద్దులు మీరి ప్రవర్తించనూరాదు. అల్లాహ్ నిర్ణయించిన హద్దుల్ని మీరినట్లయితే అల్లాహ్ ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. ఎవరయినా అత్యాచారం జరిపినప్పుడు, అన్యాయంగా అక్రమంగా ఇతరుల హక్కులపై దాడి జరిపినప్పుడు దాన్ని ప్రతిఘటించవలసిందే, ప్రతిఘటించకపోతే ప్రపంచం అల్ల కల్లోలం పాలవుతుంది, అరాచకం ప్రబలు తుందని వేరే చెప్పనవసరం లేదు.

ముస్లిమేతరులు కేవలం ముస్లిమేతరులవడం చేత ఖుర్ఆన్ వారి ఎడల సద్ప్రవర్తనను కూడదంటుందని అనడం సబబుకాదు; ఇది అన్యాయం. స్వయంగా ఖుర్ఆన్ ప్రకటన చూడండి:

> **ధర్మం విషయంలో మీతో పోరాడని వారికి, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి తరిమి వెయ్యనివారికి మీరు పరోపకారం చెయ్యడాన్ని, వారి ఎడల మృదువుగా ప్రవర్తించడాన్ని, న్యాయంగా వ్యవహ రించడాన్ని అల్లాహ్ కాదనడు. అల్లాహ్ అయితే న్యాయంగా వ్యవహరించేవారిని ఎంతో ఇష్టపడతాడు. ధర్మం విషయంలో మీతో పోరాడినవారు, మిమ్మల్ని మీ ఇళ్ళనుండి గెంటివేసిన వారు, మిమ్మల్ని గెంటివేయడంలో ఒకరికొకరు తోడ్పడిన వారు- కేవలం వారితో స్నేహం చెయ్యడాన్నే అల్లాహ్ మిమ్మల్ని వారిస్తున్నాడు. (అల్ ముమ్తహిన : 8 - 9)**

ఈ ఆయత్‌లను బట్టి ద్యోతకమయ్యే దేమిటంటే, ఖుర్ఆన్ ముస్లిములను, ముస్లిమేతరులతో స్నేహం చెయ్యడాన్ని, వారిపట్ల మేలుచేయ్యడాన్ని, వారితో ఉత్తమ రీతిలో వ్యవహరించడాన్ని, వారి ఎడల న్యాయంగా ప్రవర్తించడాన్ని ఎన్నటికీకాదనదు పైగా వారిపట్ల ఉత్తమ రీతిలో వ్యవహరించే వారిని, న్యాయం చేసేవారిని ప్రోత్సహిస్తుంది వారికి శుభవార్త అందజేస్తూ ఇటువంటి వారిని అల్లాహ్ ఎంతో ప్రేమిస్తాడని ప్రకటిస్తుంది. అయితే వారు కుట్రలు పన్నేవారు, ప్రాణహాని కలిగించే వారు కాకుండా ఉండాలి. శత్రుత్వం వహించే వారి విషయంలో ఖుర్ఆన్ సిద్ధాంతం వేరు. వారి ఎడల సత్ప్రవర్తన కనబరచి వారిని ఆప్తులుగా చేసుకోమంటుంది.

ఒకచోట ఖుర్ఆన్ అంటుంది:

**మంచీ చెడూ రెండూ సమానం కాజాలవు. నీవు (చెడుకు) ప్రతిగా ఉత్తమరీతితో ప్రవర్తించు. అప్పుడు నీవు గమనిస్తావు, ఈ విధానం వల్ల నీ పట్ల వైషమ్యం గల వ్యక్తే నీకు ఆప్త మిత్రుడయిపోతాడు.**

**(హా మీమ్ అస్సజ్దా : 34)**

మంచి పనుల్లో ఎవరితోనయినా సరే, ముస్లిమేతరులతోనయినా సరే సహకరించవలసిందేనని నొక్కిచెబుతుంది ఖుర్ఆన్:

**ఒక వర్గం గౌరవప్రదమయిన మస్జిద్ (కాబా గృహం) దారిని మీకై మూసి వేసినందుకు కలిగే ఆగ్రహం మిమ్మల్ని రెచ్చగొట్టి, మీరున్నూ వారికి ప్రతిగా అనుచితమయిన అత్యాచారాలకు పాల్పడేలా చెయ్యరాదు, తప్పు. సత్కార్యాల్లో, దైవభక్తి పనుల్లో మీరు అందరితోనూ సహకరించండి. పాపకార్యాలు, అత్యాచారాలలో ఎవ్వరితోనూ సహకరించకండి. దైవానికి భయపడండి, ఆయన శిక్ష మరీ కఠినమయింది.**

**(అల్ మాఇద : 2)**

మానవాళికి దివ్యఖుర్ఆన్ అందజేసిన శాశ్వత సూత్రం అమూల్యమయినది:

**ఒక మనిషి హత్యకు బదులుగా, లేక నేలపై అల్లకల్లోలాన్ని రేకెత్తించినందువల్ల తప్ప మరే కారణంగానయినా సరే ఒక మానవుణ్ణి సంహరించినవాడు సకల మానవాళిని హత్య చేసినట్లే. అలాగే ఒక ప్రాణాన్ని కాపాడినవాడు సకల మానవాళికి ప్రాణం పోసినట్లే.**

**(అల్ మాఇద : 32)**

ఖుర్ఆన్ అందజేసిన ఈ విశ్వజనీన సూత్రం ప్రకారం హత్యానేరానికి శిక్షగా, సమాజంలో శాంతి భద్రతల్ని నాశనం చేసేవారికి, కలహాలను కల్లోలాన్నీ సృష్టించేవారికి శిక్షగా మరణదండన విధించడం తప్ప మరే కారణంగానయినాసరే, ఎవరినీ– కులమత విచక్షణ లేకుండా ఏ మానవుణ్ణీ– చంపరాదు. పైగా అధర్మంగా ఒక వ్యక్తిని చంపడం మొత్తం మానవాళిని సంహరించడంతో

సమామని, ఒక మనిషిని రక్షించడం యావత్ మానవుల్ని రక్షించడంతో సమానమని ఘోషించింది.

ఈ వివరణల వల్ల, కల్కత్తా కేసుకు సంబంధించిన ఆ పుస్తకంలో ఉదాహరించిన ఆయత్‌లను వాటి సందర్భాలనుంచి, వాటి పూర్వాపరాలనుండి వేరు చేసి అర్థాన్ని వక్రీకరించే ప్రయత్నం చెయ్యడం జరిగిందని ఇట్టే తెలుసుకో వచ్చు. అయినప్పటికీ ఆ 24 ఆయత్‌లను ఒక్కొక్క దాన్ని సవివరంగా పరిశీలించ డానికి ప్రయత్నిద్దాము. ఈ ఆయత్‌లో అత్యధికంగా ఒక ఇస్లామీయ రాజ్యంలో, ఇస్లామీయ ప్రభుత్వానికి ఇచ్చే ఆదేశాలే ఉన్నాయి. వాటిని సాధారణ పరిస్థితులకు వర్తింపజేయడం ఎంత మాత్రం కుదరదు, అలా చేయడం అన్యాయం, అధర్మం.

1. **కనుక నిషిద్ధ మాసాలు గడచిన తరువాత బహుదైవారాధకులు ఎక్కడ ఎదురయితే అక్కడ వారిని హతమార్చండి. వారిని పట్టుకోండి, చుట్టు ముట్టండి, ప్రతి మాటులో వారి సమాచారం కొరకు వేచి కూర్చోండి. కాని వారు పశ్చాత్తాపంతో మరలినట్లయితే నమాజ్‌ని స్థాపిస్తే, జకాత్ చెల్లిస్తే వారిని వదలివేయండి. అల్లాహ్ అమితంగా మన్నించేవాడు, ఎంతో కరుణించేవాడు. (అల్ తౌబా : 5)**

ఇదీ పూర్తి ఆయత్.

ఈ సూరా (తౌబా)లో ఇస్లామీయ ప్రభుత్వానికి ఎదురయ్యే అనేక సమస్యలు, ముఖ్యంగా యుద్ధమూ, సంధి, ఒడంబడికలు, ఒప్పందాల విషయాలు విరివిగా చర్చించబడ్డాయి. ప్రస్తుత ఆయత్ కూడా ఈ విషయాలకు సంబంధిం చినదే. ఇందులో ముస్లిముల (సాముదాయిక వ్యవస్థ, ఇస్లామీయ ప్రభుత్వం)తో ఒప్పందం చేసుకున్న తరువాత భంగపరచిన వారిని గురించిన ఆదేశాలున్నాయి. దీనికి ముందు ఆయత్ (నెం. 4) చూడండి. అందులో-

> **కాని మీరు ఒప్పందం చేసుకున్న బహుదైవారాధకులు, ఆ తరువాత మీ పట్ల తమ మాటను నిలబెట్టుకోవడంలో ఏమాత్రం కొరత రానివ్వక, మీకు విరుద్ధంగా ఇతరులెవ్వరికీ సహాయం అందజేయక ఉన్నట్లయితే ఇలాంటి వారి యెడల మీరు కూడా, వారితో పెట్టుకున్న గడవు వరకు ఒప్పందాన్ని పాటించండి, అల్లాహ్ ధర్మనిష్ఠాపరులంటేనే ఇష్టపడతాడు. (అత్ తౌబా : 4)**

అనే ఆదేశముంది. దీని తరువాతి ఆయత్‌లలో ఆశ్రయం కోరిన శత్రు సైనికులకు సంబంధించిన ఆదేశముంది. వారికి భద్రతలభించే చోటికి వారిని సురక్షితంగా చేరవేయాలన్న ఆదేశముంది. తరువాత బహుదైవారాధకులయిన విరోధుల ఆగడాల వివరాలున్నాయి. ఉదాహరణకు,

> **మీరు ఈ జనంతో పోరాడరా - తమ ప్రమాణాలను భంగపరుస్తూ ఉన్నవారు, దైవసందేశహరుణ్ణి దేశం నుండి వెలివెయ్యాలని సంకల్పించినవారు, ఇంకా మొదట అత్యాచారాన్ని ప్రారంభించినవారూ వీరే అయినప్పుడు- వీరితో పోరాడరా? మీరు వీరంటే భయపడు తున్నారా? మీరు విశ్వాసులే అయినట్లయితే మీరు భయపడటానికి అధికంగా హక్కుగలవాడు అల్లాహ్ ఒక్కడే. (అత్ తౌబా : 13)**

ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు, ప్రవక్త, ఆయన సహచరుల పట్ల చేసిన అనేక నేరాలకు ఎంతగా శిక్షించినా తక్కువే. ఏ రాజ్యమయినా తన శత్రుసేనలు, లేక శత్రువులు చేసిన దురంతాలకుగాను వారిని శిక్షించాలనే కోరుకుంటుంది. అయినా వారిలో మార్పు వస్తే, చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెందినట్లు కనబడితే మన్నించమని, వారిని వారి మానాన వదలివేయాలనీ ఆదేశమయింది. ఇంతకన్నా ఉదారత మరేంకాగలదు.

2. **విశ్వసించినవారలారా, బహుదైవారాధకులు అపరిశుద్ధులు. అందువల్ల ఈ సంవత్సరం తరువాత వీరు పవిత్ర మస్జిద్ దరిదాపులలో కూడా తారసపడరాదు. ఒకవేళ మీకు లేమి దాపురిస్తుందన్న భయముంటే, అల్లాహ్ తన అనుగ్రహంతో మిమ్మల్ని సంపన్నులుగా చేయడం, ఆయన కోరుకుంటే, అసంభవమేమీకాదు. అల్లాహ్ సర్వజ్ఞాని, వివేచనా శీలి. (అత్ తౌబా : 28)**

మూలంలో "ముష్రిక్" అనే పదం ప్రయోగించ బడింది. దానికి "బహు దైవారాధకులు" అని మేము అనువదించాము. ఆంగ్లానువాదంలో Idolators (విగ్రహారాధకులు) అని ఉంది. ఎవరయితే సృష్టికర్త, పోషకుడు, పాలకుడు, స్వామి, ప్రభువయిన దైవాన్ని కాదని, లేక ఆయనతోపాటు, ఇతరుల్నీ పూజిస్తారో వారిని ఖుర్ఆన్ పారిభాషికంగా 'ముష్రిక్' లేక 'దైవత్వంలో సహవర్తులుగా భావించేవారు' అని అంటుంది. వారు అపరిశుద్ధులని అంటే వారు తమ కర్తను

కాక ఇతరుల్ని ఆరాధ్యులుగా భావించడంచేత వారి ఆంతర్యం అశుద్ధమయినదని అర్థం. దైవాన్ని వదలి ఇతరుల్ని ఆరాధ్యులుగా భావించడాన్ని సమస్త దైవిక గ్రంథాల్లోనూ ఖండించడం జరిగింది. ఆ ఆధ్యాత్మిక భావంలోనే బహు దైవా రాధకుల్ని అశుద్ధులుగా వర్ణించడం జరిగింది. ఈ ఆధ్యాత్మిక అశుద్ధత కారణం గానే వారిని కాబా గృహం, మదీనాలోని మస్జిదున్నబి (పవిత్ర మస్జిదు)లున్న ప్రాంతాల్లో ప్రవేశాన్ని నిషేధించడమూ జరిగింది. అంతే కాని ముస్లిమేతరులు ముస్లిమేతరులయినందువల్ల, వారు అశుద్ధులని ప్రకటించలేదు. ఖుర్‌ఆన్‌లోని ఆదేశం:

> **గ్రంథవహుల భోజనాన్ని మీ కొరకు, మీ భోజనాన్ని వారి కొరకు ధర్మసమ్మతం చెయ్యడం జరిగింది. (అల్ మాఇద : 5)**

దైవప్రవక్త ముహమ్మద్ (స) ముస్లిమేతరుల్ని ఎన్నడూ పుట్టుక రీత్యా అశుద్ధులుగా పరిగణించి వ్యవహరించలేదు. ఆయనగారి బాబాయి అబూతాలిబ్ కడవరకు ఇస్లామ్ స్వీకరించలేదు. అయినా ఆయనతోపాటు అన్న పానీయాలు పుచ్చు కోవడమే కాదు, ఆయన జీవించి ఉన్నంతకాలం ఆయన సంరక్షణలోనే గడిపారు ప్రవక్త మహనీయులు (స). ఆయన మక్కా నుండి మదీనా వలస వెళ్ళినప్పుడు దారిచూపిన నౌకరుకూడా ముస్లిమేతరుడే. ప్రవక్త బంధువులు, ఆయన సహచరుల బంధువులు అనేకమంది బహుదైవారాధకులు, తిరస్కారులే. వారితోపాటే అన్నపానీయాలు పుచ్చుకుంటూ ఉండేవారు. ముస్లిములు ఎన్నడూ ముస్లిమేతరులు వండిన వాటిని తినడానికి జంకలేదు. నేటికీ, భారతదేశంలోనూ ముస్లిమేతర సోదరులతో కలసి మెలసి, ఒక్కోసారి ఒకే పళ్ళెంలోనూ భుజించిన సందర్భాలున్నాయి. ఖుర్‌ఆన్ దృష్టిలో మానవులంతా వారెవరయినాసరే, ఒకే తల్లిదండ్రుల (ఆదమ్ హవ్వాల) సంతానం, అందువల్ల పరస్పరం సోదరులు.

3. ఆయత్ పూర్తిగా చూడండి:

> **ఇక మీరు ప్రయాణానికి బయలు వెడలినప్పుడు నమాజ్‌ని క్లుప్తంగా చేస్తే అందులో తప్పులేదు- (ముఖ్యంగా) తిరస్కారులు మిమ్మల్ని బాధ పెడతారన్న భయమున్న సందర్భాలలో. ఎందువల్లనంటే వారు బట్టబయలుగానే మీ పట్ల శత్రుత్వానికి ఒడిగట్టారు. (అన్ నిసా : 101)**

ఈ ఆయత్ మొత్తం, దాని తరువాతి ఆయత్‌లోనూ యుద్ధకాలంలో లేక ఒక ప్రక్కన యుద్ధం జరుగుతూ ఉన్నప్పుడు 'నమాజ్' చేసే పద్ధతిని వివరించడం జరిగింది. ఆ సందర్భంలోనూ మాటుకాచి దెబ్బతీయగల శత్రువుల్ని గురించి హెచ్చరిస్తూ, అటువంటి సందర్భంలోనూ నమాజ్‌ను మానుకో రాదని, దైవంతో తమ సంబంధాన్ని పటిష్ఠం చేసుకోవాలని చెబుతుంది. అయితే ఆ సందర్భంలోనూ నమాజ్ చేసే పద్ధతిని నేర్పుతూ హెచ్చరిస్తుంది. ఈ పూర్వ రంగంలో పలికిన ఈ మాటల్ని- "తిరస్కారులు మిమ్మల్ని బాధపెడతారని మీకు భయమున్నట్లయితే, నిస్సందేహంగా తిరస్కారులు మీకు పచ్చి విరోధులు" అని అన్నదాన్ని సాధారణ పరిస్థితులకు వర్తింపజేసి పెడర్థాలు తీయడం అన్యాయం.

4. **విశ్వసించినవారలారా, మీకు దగ్గరలో ఉన్న సత్యతిరస్కారులతో మీరు పోరాడండి. వారు మీలో కాఠిన్యాన్ని చవిచూడటం అవసరం. అల్లాహ్ నిష్ఠాపరులయిన వారికే తోడయి ఉన్నాడని తెలుసుకోండి.**

**(అత్ తౌబా : 123)**

మదీనా నగర రాజ్యానికి చుట్టుపట్లనున్న కుగ్రామాల ముస్లిములను, నగర సివారు ప్రాంతాల ముస్లిములను, దగ్గరనున్న బహుదైవారాధకులు అప్పుడప్పుడు దాడులు జరిపి బాధ పెట్టేవారు. అందుకే ప్రస్తుత ఆయత్‌కు పూర్వపు ఆయత్‌లలో అందరూ ఒక్కసారిగా మదీనాకు వెళ్ళి ధార్మికజ్ఞాన సముపార్జన చేయడానికి బదులు చిన్నచిన్న వర్గాలుగా వెళ్ళడం మంచిదని బోధించడం జరిగింది. ఆ తరువాత మదీనా భద్రతా దళాలను సంబోధించి చుట్టుపట్లనున్న వారు మిమ్మల్ని మెత్తని మెతుకుగా భావించి నమిలివెయ్యాలని అనుకోకుండా కాస్త కటువుగా వ్యవహరించవలసిందని బోధించడం జరిగింది. ఇస్లామీయ రాజ్యానికి, అపరాధులయిన తిరస్కారులకు సంబంధించిన ఆదేశమే ఇది. సామాన్య ముస్లిమేతరులకు, సామాన్య ముస్లిములకు సంబంధించింది కాదు.

5. **ఎవరయితే మా వచనాలను విశ్వసించడానికి తిరస్కరించారో వారిని మేము రూఢీగా అగ్నిలోనే విసరివేస్తాము. అక్కడ వారి శరీర చర్మం**

**కరిగిపోయినప్పుడు దాని స్థానే మరో చర్మాన్ని పుట్టిస్తాము. వారు యాతనా రుచిని మాగొప్పగా ఆస్వాదించాలని. అల్లాహ్ అసమాన సమర్థుడు, తన నిర్ణయాలను అమలు పరచడంలో గల విజ్ఞతను బాగా ఎరిగినవాడు. (అన్‌నిసా : 56)**

ఖుర్‌ఆన్ దైవికగ్రంథం అని అది ప్రకటిస్తుంది. అది దైవిక గ్రంథమో కాదో అన్న అనుమానం ఉన్నట్లయితే దాన్ని పరిశోధన ద్వారా ధ్రువపరచుకోవాలి. కాని దాని ఈ ప్రకటనను దృష్టిలో ఉంచుకునే దాన్ని అర్థం చేసుకునేందుకు ముందుకు సాగాలి. ఆ దైవిక గ్రంథం, దాని ఆయత్‌లను, ఆదేశాలను, నియమాలను, పాటించనివారికి నరకం ప్రాప్తమవుతుందని, ఆ నరకంలో ఎంతో కఠిన శిక్షను అనుభవించవలసి ఉంటుందని అది చెప్పకపోతే మరేమని చెబుతుంది? ఈ ఆయత్‌నయినా ఇటువంటి మరే ఆయత్‌లనయినా సరే, అర్థం చేసుకునేందుకు ఖుర్‌ఆన్‌ని అదొక దైవ గ్రంథమని, అది మరణానంతర జీవితానికి సంబంధించిన ఒక విశ్వాసాన్ని, ఒక సిద్ధాంతాన్ని ముందుంచుతుందని అంగీకరించి మరీ నిష్పక్షపాత దృష్టితో చదవాలి. ఈ ఆయత్‌లో ముస్లిములు ముస్లిమేతరుల పట్ల ఎలా వ్యవహరించాలో అన్న విషయం చర్చించబడలేదని గమనించాలి. ఇందులో అల్లాహ్ ఎలా వ్యవహరిస్తాడో అన్న విషయం మటుకు తెలుపడం జరిగింది.

6. **విశ్వసించిన జనులారా, మీ తండ్రులూ, సోదరులు విశ్వాసానికి బదులుగా తిరస్కారానికి ప్రాధాన్యతనిస్తే వారిని కూడా మీ సన్నిహితులుగా చేసుకో కండి. మీలో ఎవరయితే వారిని తమ సన్నిహితులుగా చేసుకుంటారో, నిస్సందేహంగా వారే దుర్మార్గులు. (అత్ తౌబా : 23)**

ఇదీ తౌబా సూరాలోని ఆయతే. తౌబా సూరాలో ముస్లిముల రాజ్యానికీ వారి విరోధులకూ మధ్య సాగుతున్న సంఘర్షణ వివరాలున్నాయని తెలుసు కున్నాము. వారు ముస్లిములను, ఇస్లామ్‌ను సర్వనాశనం చేసే కుట్రలు పన్నుతున్నారు. ఇటువంటి అత్యంత ప్రాణాంతకమయిన పరిస్థితుల్లో ముస్లిములు ఇస్లామ్ స్వీకరించని తమ బంధువుల ఎడల జాగరూకులయి మెలగవలసిందని, వారికి తమ ఆప్తమిత్రులుగా, సన్నిహితులుగా చేసుకోరాదని, వారు విరోధుల కుతంత్రాల వలలో పడే ప్రమాదముందని, మీరూ వారి చేతుల్లో పనిముట్లుగా

మారరాదని హెచ్చరించడం జరిగింది. పూర్వోత్తరా పరిశీలించకపోతే ఏ వచనాని కయినా పెడర్థాలు తీయడం సులువవుతూ పోతుంది.

మన దేశంలోనూ సమాజానికీ దేశానికీ హాని కలిగించే శత్రువుకు, లేదా అపరాధికి అతని బంధువులు, అతని మిత్రులు ఎవరయినా ఆప్తుడుగా రక్షణ కల్పిస్తే అలా ఆశ్రయమిచ్చిన వారిని కూడా దోషులుగానే పరిగణించడం జరుగుతుంది. ఏ దేశ చట్టమయినా సర్వ సాధారణ పరిస్థితుల్లోనూ ఇటువంటి వాటిని భరించదు. అత్యవసర పరిస్థితుల్లోనయితే మరీను.

ఇస్లామ్ మానవులందరి కొరకు ఒక సమగ్ర జీవన వ్యవస్థ. అదొక రాజకీయ వ్యవస్థను సయితం ప్రతిపాదిస్తుంది. అన్ని కాలాలకు, పరిస్థితులకు వర్తించే ఆదేశాలు ఇందులో ఉండటం సహజం, అవసరం కూడా. భద్రత, క్షేమం, రక్షణ, రాజ్యబాధ్యత, దానికి అవసరమయిన ఆదేశాలూ అవసరమే. ఖుర్‌ఆన్ చెప్పేది కేవలం:

> **ధర్మం విషయంలో మీతో పోరాడిన వారు, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి గెంటివేసినవారు, మిమ్మల్ని గెంటివేయడంలో ఒకరికొకరు తోడ్పడిన వారు- కేవలం వారితో స్నేహం చేయడాన్నే అల్లాహ్ మిమ్మల్ని వారిస్తున్నాడు. (అల్ ముమ్తహిన : 9)**

సాధారణ పరిస్థితులకు వర్తించే ఖుర్‌ఆన్ ఆదేశాలు:

> **ఇదీ వాస్తవమే, మానవుడు తన తల్లిదండ్రుల హక్కులు గుర్తించాలని మేము స్వయంగా తాకీదు చేశాము. అతని తల్లి అశక్తతపైన అశక్తతను భరించి అతన్ని తన గర్భాన ధరించింది. అతనుపాలు విడువటానికి రెండేళ్ళు పట్టాయి. (అందువల్లనే మేము అతనికి హితవు గరిపాము.) నాకు కృతజ్ఞుడవయి నీ తల్లిదండ్రులకూ కృతజ్ఞతలర్పించుకో, నా వైపునకే నీవు మరలవలసి ఉంది. కాని ఒకవేళ వారు నీపైన ఒత్తిడి తెచ్చి నాతోపాటు మరెవరినయినా, నీ ఎరుకలో లేనివారిని, నాకు సహవర్తులుగా చేయాలని వాంఛించినట్లయితే నీవు వారి మాటను ఎట్టి పరిస్థితిలోనూ పాటించవద్దు. ప్రపంచంలోమటుకు వారి ఎడల సద్వర్తనతో వ్యవహరిస్తూనే ఉండాలి. అయితే నావైపునకు మరలించే**

**వ్యక్తిని మాత్రమే అనుసరించు; ఆ తరువాత మీరంతా మరలి రావలసింది నావైపునకే. అప్పుడు మీకు తెలుపుతాను మీరు ఎటువంటి ఆచరణలు చేస్తూ ఉండేవారో. (లుక్మాన్ : 14,15)**

తల్లిదండ్రులు ముస్లిములయినా ముష్రికులూ తిరస్కారులే అయినా వారి ఎడల ఉత్తమరీతిలో ప్రవర్తిం చాలని, వారికి సేవలు అందజేయాలని ఆదేశిస్తుంది ఖుర్‌ఆన్. అయితే అటువంటి మహోపకారులే తప్పుడు వ్యవహారాలను ఆదేశిస్తే ఆ మాటను మాత్రం అంగీకరించవద్దని అంటుంది. ప్రహ్లాదుడూ హిరణ్య కశిపుడి గాధలో ఈ భావం మనకు కానరావడం లేదా?

7. **వాస్తవానికి నెలల సంఖ్య, అల్లాహ్ భూమీ ఆకాశాలను సృష్టించిన నాటి నుంచీ అల్లాహ్ గ్రంథంలో పన్నెండే. వీటిలోని నాలుగునెలలు పవిత్ర మయినవి. అదేసరయిన నియమం. అందువల్ల నాలుగు నెలలో మీ మీద మీరే అత్యాచారానికి పాల్పడకండి. అందరూ కలసి బహుదైవా రాధకులతో పోరాడండి- వారంతా కలసి మీతో పోరాడినట్లు. బాగా తెలుసుకోండి, అల్లాహ్ ధర్మనిష్ఠగలవారికే తోడయి ఉన్నాడు. 'నసీ' అన్నది తిరస్కారంలోనే మరింత తిరస్కార చేష్ట. దీని మూలంగానే ఈ తిరస్కారుల్ని మార్గ విహీనతకు గురిచెయ్యడం జరుగుతుంది. ఒక్కొక్క సంవత్సరం ఒక నెలను హలాల్ (ధర్మ సమ్మతం) చేసు కుంటారు. మరొక సంవత్సరం దాన్ని నిషిద్ధమయినదిగా పరిగణిస్తారు. ఈ విధంగా అల్లాహ్ నిషేధించిన నెలల సంఖ్యను పూర్తి చేయాలనీ అల్లాహ్ నిషేధిం చిన దాన్ని ధర్మ సమ్మతం చేసుకోవాలనీ కోరుకుంటారు. వారి దుశ్చేష్టలు వారికి అలంకార ప్రాయమయినవిగా చేయబడ్డాయి. అల్లాహ్ సత్య తిరస్కారులకు రుజు మార్గం చూపడు. (అత్ తౌబా : 36, 37)**

ఇక్కడ 37వ ఆయత్‌లోని చివరి భాగాన్ని మటుకే పేర్కొని అభ్యంతరం వెలిబుచ్చడం జరిగింది. దీనికి పూర్వపు ఆయత్ (36)ని, దీన్నీ కలిపి పూర్తిగా చదివినట్లయితే దీని సందర్భం ఏమిటో బోధపడుతుంది. హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ ఇస్మాయీల్ (అ) ఏర్పరచిన నియమాలను త్రోసిపుచ్చి, నెలలను తారు మారుచేసి తమకు అనుకూలమయిన రుతువులో 'హజ్జ్' నెల వచ్చేలా

మార్చుకునేవారు కురైష్ బహుదైవారాధకులు. అంటే హలాల్ హరామ్ ఆదేశాలను తమకు అనువయిన రీతిలో మార్చు కునేవారన్నమాట. బహుదైవారాధకుల, తిరస్కారుల ఈ పోకడను నిరసిస్తూ వారు ఈ విధానాన్ని మార్చుకోవడానికి సిద్ధంగా లేకపోతే, తమ తిరస్కార వైఖరిని మార్చుకోకపోతే వారిని బలవంతాన సన్మార్గాన తీసుకువచ్చే బాధ్యత ఎవరిపైనా లేదు, వారి స్వేచ్ఛను హరించి వేయడం దైవం అనుసరించే పద్ధతి కాదు. అంటే అల్లాహ్ తిరస్కారానికే ఒడిగట్టిన వారికి బలవంతాన దారిచూపి, సన్మార్గాన నడిపించడన్న మాట.

8. పూర్తి ఆయత్ అనువాదం ఇది:

**విశ్వసించినవారలారా, మీకు పూర్వం గ్రంథం ప్రసాదించబడిన వారిలో, మీ ధర్మాన్ని ఆట వస్తువుగా, కాలక్షేప సామగ్రిగా ఎంచేవారినీ ఇతర తిరస్కారులనూ మీ మిత్రులుగా, సహచరులుగా చేసుకోకండి. మీరు విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడండి. (అల్ మాఇద : 57)**

ఈ ఆయత్‌ను పూర్తిగా పఠించినా సందర్భమేదో తేటతెల్లమవుతుంది; దీని ముందున్న ఆయత్‌లను, దీని తరువాతి ఆయత్‌లను పరిశీలిస్తేనూ అతి సులువుగా బోధపడుతుంది. ఇస్లామ్‌ను, ముస్లిములను, ముస్లిముల ఆచార వ్యవహారాలను, ప్రార్థనలను అవహేళన పరిచే క్రైస్తవులు, యూదులు, తిరస్కారుల ప్రస్తావన జరుగుతుంది. అయితే ఈ ఆపహసించే వారితో ముస్లిముల సంబంధాలూ ఉండేవి. వారి సహవాసం వల్ల ముస్లిముల్లోనూ అపవిశ్వాసాలు చోటుచేసుకునే ప్రమాదముంటుంది, పైగా వారి కుట్రలూ కుతంత్రాలకు ముస్లిములు పావులుగా మారే అవకాశమూ ఉంది. అందువల్ల ఈ ఆదేశమివ్వడం జరిగింది. ఇందులో ఆక్షేపణీయమయిన అంశమేముందో?!

9. **వీరిపైన అన్నివైపుల నుండి అభిశాపం కురుస్తుంది. ఎక్కడెక్కడ కానవచ్చినా పట్టు బడతారు, మా చెడ్డగా సంహరించబడతారు. (అల్ అహ్‌జాబ్ : 61)**

దీని ముందున్న ఆయత్ (60), తరువాతి ఆయత్ (62) కలిపి మొత్తాని చదివినట్లయితే అసలు విషయం బోధపడుతుంది.

**ఒకవేళ మునాఫికులు, అంతర్యాల్లో చెడుగునిండి ఉన్నవారు, మదీనాలో కలకలం సృష్టించే వదంతులు వ్యాపింపజేస్తున్నవారు తమ దుశ్చేష్టలు మానుకోకపోతే వారికి ప్రతిగా చర్యలు గైకొనడానికి మేము నిన్ను లేపి నిలబెడతాము, ఆ తరువాత వారు ఈ నగరంలో నీతోపాటు నివసించ గలగటం బహుకష్టం. వీరిపైన అన్నివైపుల నుండి అభిశాపం కురుస్తుంది. ఎక్కడెక్కడ కానవచ్చినా పట్టుబడతారు, మా చెడ్డగా సంహ రించబడతారు. ఇది అల్లాహ్ సంప్రదాయం- ఇటువంటి జనుల విషయంలో తొలినుంచీ వస్తున్నదే; మరి నీవు అల్లాహ్ సంప్రదాయంలో ఎటువంటి మార్పునూ కానలేవు. (అహ్జాబ్ : 60 - 62)**

బయటికి ముస్లిములుగా కనిపిస్తూ, ముస్లిములతోపాటు కపటంగా వ్యవహరిస్తూ ఉండే ద్వంద్వ స్వభావుల్ని ఖుర్ఆన్ 'మునాఫిక్‌లు' అని పారిభాషి కంగా వర్ణిస్తుంది. ఈ ఆయత్‌లలో ఇలాంటి వారి ప్రస్తావనే ఉంది. ఒక సరయిన వ్యవస్థ, సత్సమాజం నెలకొల్పాలంటే ఇటువంటి చీడపురుగుల్ని ఏరివేయడం తప్పనిసరి. పాలుపోసి పాముల్ని పెంచుకునే బుద్ధిమంతుల్ని ప్రపంచంలో ఏ సమాజమూ సమర్థించదు. ఇది స్పష్టమయిన విషయం, ఇందులో తప్పేమిటో బోధపడదు.

10. **నిస్సందేహంగా మీరున్నూ, దైవాన్ని కాదని మీరు పూజించే ఆరాధ్యు లున్నూ నరకపు సమిధలు; అక్కడికే మీరూ చేరవలసి ఉంది. (అల్ అన్బియా : 98)**

ఇస్లామ్ బహుదైవారాధనను ఖండిస్తుంది. దాని ప్రకారం ఒకే సృష్టికర్త సకల భువన భాండవాలకు ప్రభువయినప్పుడు బుద్ధీ వివేకాలున్న ఈ మానవుడు ఆ ఒకే ఒక్క దైవాన్ని విశ్వసించాలి. నిజస్వామిని కాదని మనిషి ఎవరెవరిని ఆరాధిస్తాడో, మరెవరెవరి ఊడిగం చేస్తాడో వారినందరినీ ఖండిస్తుంది ఖుర్ఆన్. ప్రపంచంలో ఎల్లెడలా తన ప్రవక్తల్ని పంపి, తన గ్రంథాలను అవతరింపజేసి దైవం, మార్గం చూపిన తరువాత, ప్రవక్తల ఆదర్శజీవితం ప్రస్ఫుటంగా చూపెట్టిన తరువాత కూడా ఎవరయినా బహుదైవారాధనకు పాల్పడితే దైవాన్ని కాదని

ఇతరుల విధేయత పాటించడానికి ఒడిగడితే వారు దైవ శిక్షకు తప్పనిసరిగా గురికావలసి ఉంటుంది.

ఈ ఒక్క ఆయత్‌ను కాక 91వ ఆయత్ మొదలుకుని 100వ ఆయత్ వరకు పరిశీలిస్తే ఇందులో గల హేతువు ఏమిటో ద్యోతకమవుతుంది.

**11. మరెవరికయితే అతని ప్రభువు వచనాల ద్వారా హితవు గరిపినప్పుడు అతను వాటికి విముఖుడవుతాడో, అటువంటివానికన్నా దుర్మార్గుడెవడు కాలడు? (అస్ సజ్దా : 22)**

ఖుర్ఆన్ ఒక ధార్మిక గ్రంథం. ధర్మంలో దైవం, దైవాదేశాలు, వాటిని పాటించేవారు, వాటిని తిరస్కరించే వారు- వీటన్నింటి ప్రస్తావన ఉంటుంది. వాటితోపాటు దైవాదేశాలను పాటించేవారికి న్యాయవంతంగానే ప్రాప్తించవలసిన బహుమానాలు, పాటించనివారికి విధించబడే శిక్షను గురించి కూడా ధార్మిక గ్రంథంలో తప్పక ప్రస్తావించబడి ఉంటుంది. దైవాదేశాలను ధిక్కరించే వారికి, దైవాదేశాలను జ్ఞాపకం చేసినా ఖాతరు చేయనివారికి దైవం వద్ద లభించే శిక్షను ప్రస్తావించి మంచి వైపునకు మరల్చడం కూడా ధార్మిక బోధలో ఒక అంశం. దీన్ని కాదనడం ధర్మాన్నీ దాని హేతువునూ కాదనడమే. ఈ సందర్భంలో ఇదే సూరాలోని 20,21వ ఆయత్‌లతోపాటు దీన్ని కలిపి చదవడం సమంజసం.

**12. మీకు ఇతోధికంగా ప్రాప్తం కాబోతున్న యుద్ధ ప్రాప్తిని గురించి అల్లాహ్ మీకు వాగ్దానం చేస్తున్నాడు. (అల్ ఫత్హ్ : 20)**

దీన్ని చదువుతూ ఈ సూరా, 18,19,21వ ఆయత్‌లను సయితం పరిశీలిస్తే అసలు ఉద్దేశం ఏమిటో బోధపడుతుంది. అసలు సందేశం, అనతి కాలంలోనే ప్రాప్తం కానున్న విజయాన్ని గురించిన శుభవార్త నివ్వడం. దానితో పాటు యుద్ధప్రాప్తిని గురించి కూడా ముందుగానే తెలియజేయడం జరిగింది. యుద్ధప్రాప్తి అని మేము అనువదించినది పాశ్చాత్య యుద్ధనీతిలోనూ Spoil of war అన్నపేరిట న్యాయ సమ్మతం చేయబడిన వస్తుసామగ్రి. పరాజిత సేనలు వదలివేళ్ళగా విజయులయిన సేనలు సేకరించే సామగ్రి అన్నమాట. పాశ్చాత్య చట్టం ప్రకారం అది ప్రభుత్వబొక్కసానికి వెడితే ఇస్లామీయ శాసనాంగం రీత్యా

అయిదవ వంతు ప్రభుత్వ కార్యకలాపాలకు ఖర్చుకాగా మిగతా సొమ్ము యుద్ధంలో పాల్గొన్న యోధులయిన సైనికుల్లో పంచిపెట్టబడుతుంది. ఇదీ యుద్ధానికీ, ఇస్లామీయ రాజ్యానికీ సంబంధించిన ఆదేశమే.

13. **కాగా మీరు పొందిన యుద్ధప్రాప్తిని మీరు తినవచ్చు, అది ధర్మసమ్మత మయినదీ, పరిశుద్ధ మయినదీను. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడు, కరుణించే వాడునూ.**

**(అల్ అన్ఫాల్ : 69)**

ఇందులోనూ యుద్ధప్రాప్తికి సంబంధించిన ఆదేశముంది. వాస్తవమేమి టంటే యుద్ధప్రాప్తి కొరకు ప్రాకులాడటం, అన్నది ఇస్లామీయ దృష్టికోణం ప్రకారం వాంఛనీయమయిన అంశం కాదు. కాని ఆనాటి యుద్ధాలలో అనుసరించే పద్ధతి దృష్ట్యా అది అనుమతించబడినా దానిపట్ల సైన్యంలో ఆశ పెరగకుండా ఉండటాన్నే అభిలషించడం జరిగింది. ప్రపంచ ప్రయోజనాలకు బదులు పరలోక ప్రయోజ నాలను కాంక్షించాలని బోధించడమూ జరిగింది. ఈ సూరా 67,68వ ఆయత్ లనూ పరిశీలిస్తే ఇది స్పష్టమవుతుంది.

14. **ప్రవక్తా, తిరస్కారులు కపటులతో పోరాడు, వారి ఎడల కఠినంగా ప్రవర్తించు. వారి చిర నివాసం నరకం, అది అత్యంత హేయమయిన నివాసం.**

**(అత్‌తహ్రీమ్ : 9)**

ఇక్కడ పోరాడే ఆదేశం ఇస్లామీయ ప్రభుత్వానికే ఇవ్వబడుతోందన్న విషయం సుస్పష్టం. కొత్తగా ఏర్పడిన ఇస్లామీయ సమాజాన్ని రక్షించడం, దాని ప్రగతి మార్గాన వచ్చే అవాంతరాలను దూరం చేయడం ప్రవక్త బాధ్యతల్లోని అంశమే.

తిరస్కారులు, కపటులు, ఇస్లామ్‌ను, ముస్లిములను తుదముట్టించాలని చేసిన ప్రయత్నాల దృష్ట్యానే వారిని ఎదుర్కొని వారి కెదురుగా పోరాడవలసిందన్న ఆదేశం ఇవ్వడం జరిగింది. దైవధిక్కారులయిన వారిని, దైవమార్గాన్ని అనుస రిస్తున్న వారి దారిలో అటంకాలు, అడ్డంకులు సృష్టిస్తున్న వారిని ఎదిరించడం వారిని తొలిగించడం, దైవాన్ని విశ్వసించి ఆయన చూపెట్టిన బాటను అనుసరించే

వారి బాధ్యత. ఇటువంటి తిరస్కారులు దైవాగ్రహానికే పాత్రులుకాని అనుగ్రహానికి అర్హులవుతారా?

**15-16. ఈ తిరస్కారులకు మేము కఠిన యాతనను తప్పకుండా రుచి చూపించి తీరుతాము. వీరు చేస్తూ ఉన్న అత్యంత నీచమయిన చేష్టలకుగాను వీరికి పూర్తి ప్రతిఫలాన్ని అందజేస్తాము. అది నరకం, అల్లాహ్ పట్ల వైరం పెంచుకున్న వారికి ప్రతిఫలంగా ప్రాప్తిస్తుంది. అందులోనే వారి నివాసం చిరస్థాయిగా ఉంటుంది. ఇదీ వారికి శిక్ష, మా ఆయత్‌లను వారు తిరస్కరిస్తూ ఉన్నందుకు. (హామీమ్ అస్సజ్దా : 27,28)**

ఈ ఆయత్‌లతోపాటు 25,26వ ఆయత్‌లను సయితం కలిపి చదివినట్లయితే ఆ తిరస్కారులు ముస్లిములపట్ల ఏ విధంగా వ్యవహరించే వారో తెలుస్తుంది. దైవధిక్కారుల ఎడల, దైవాజ్ఞల్ని పరిహసించేవారి ఎడల దేవుడు వ్యవహరించే తీరు ఆ విధంగాకాక మరే విధంగా ఉంటుందో, మరే విధంగా ఉండాలో ఆలోచించవలసిన విషయం.

**17. వాస్తవానికి అల్లాహ్ విశ్వాసుల నుండి వారి ప్రాణాలను, వారి ధన సంపత్తిని, స్వర్గం ప్రతి మూల్యంగా కొనుక్కున్నాడు. వారు దైవ మార్గంలో పోరాడతారు, చంపుతారు, చంపబడతారు. వారికి అల్లాహ్ పూచి ఉన్న గట్టి వాగ్దానం (స్వర్గ వాగ్దానం చెయ్యడం జరిగింది)- తౌరాత్‌లోనూ, ఇన్జీల్‌లోను, ఖుర్‌ఆన్‌లోనూ. తన ప్రమాణాన్ని నెరవేర్చడంలో అల్లాహ్‌ను మించిన వాడెవడు? సంతోషించండి, దైవంతో మీరు కుదుర్చుకున్న మీ ఈ బేరం విషయంలో ఇక సంబరాలు జరుపు కోండి, ఇదే అత్యంత ఘనమయిన సాఫల్యం. అల్లాహ్ వైపునకు మాటి మాటికీ మరలేవారు, ఆయన దాస్యం చేసేవారు, ఆయన స్తోత్రం కీర్తనం చేసేవారు, ఆయన కొరకు భువిలో భ్రమించేవారు, ఆయన సమక్షంలో రుకూ సజ్దా (ప్రార్థన)లు చేసేవారు, మంచిని ఆదేశించేవారు, చెడును వారించేవారు, అల్లాహ్ (నియమించిన) పరిధుల్ని కాపాడేవారు (ఈ విధమయిన ఉత్తములు విశ్వాసులు, అల్లాహ్‌తో క్రయవిక్రయ వ్యవహారం నెరిపేవారు)- ప్రవక్తా, ఈ విశ్వాసులకు శుభవార్త నివ్వు. (అత్ తౌబా : 111,112)**

దైవమార్గంలో పోరాడటమంటే ఏమిటో వివరించాము. సత్యం కోసం, ధర్మం కోసం, న్యాయం కోసం, అసత్యాన్ని, అధర్మాన్ని, అన్యాయాన్ని ఎదిరించి చేసే పోరాటం అన్నమాట. పోరాటంలో కృషి, సంఘర్షణ, ఘర్షణ అన్నీ చేరి ఉన్నాయి. ఈ ఆయత్ మొత్తాన్నీ దీని తరువాతి ఆయత్‌ను సయితం కలిపి చదివినట్లయితే అసలు విషయం, పోరాడే వారి గుణగణాలు ముందుకు వస్తాయి.

18. **ఈ ద్వంద్వ స్వభావులయిన పురుషులూ స్త్రీలూ, తిరస్కారుల కొరకు అల్లాహ్ చేసిన వాగ్దానం నరకాగ్ని, అందులోనే వారు సదా ఉంటారు; అదే వారికి సరయినది; అల్లాహ్ ఛీత్కారం వారికి, స్థిరంగా కలిగే యాతనవారికి! (అత్ తౌబా : 68)**

61వ ఆయత్ నుండి 70వ ఆయత్ వరకు కపట ముస్లిములను గురించి, ద్వంద్వ నీతిపరులయిన వారిని గురించి, వారి చేష్టలను గురించి, వారి వైఖరిని గురించి, ఇస్లామీయ సమాజంలో వారి పాత్రను గురించి వివరాలున్నాయి. దేవుని అభిశాపానికి వారు గురవుతారని, వారికి అంతంకాని యాతన విధించబడు తుందని ప్రకటించకపోతే ఏ సత్సమాజమయినా కొంత కాలమయినా ఎలా మనగలుగుతుంది?

19. **ప్రవక్తా, విశ్వసించిన వారిని యుద్ధానికి సమాయత్త పరచు. మీలో స్థయిర్యంగలవారు ఇరువయి మంది సైనికులుంటే వారు రెండు వందల బలగంపైన ఆధిక్యత పొందగలరు. ఇటువంటి వారు వంద మంది ఉన్నట్లయితే సత్యతిరస్కారులు వెయ్యిమందిపైన ఆధిక్యత నొందగలరు. ఎందుకంటే (ఎదుటి వర్గం) వారు సరిగ్గా అర్థం చేసుకులేని జనులు. (అల్ అన్ఫాల్ : 65)**

సదా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే ఇస్లామ్ ఒక సమగ్ర మయిన పరిపూర్ణ జీవన వ్యవస్థ. ఇందులో పుట్టుక నుండి గిట్టుట వరకు అన్ని దశల్లో అవసరమయిన బోధనలు మానవుల వ్యక్తిగత, సామూహిక, కుటుంబ, సామాజిక, ఆర్థిక, రాజకీయ అవసరాలన్నింటికీ మార్గనిర్దేశన ఉంది. యుద్ధమూ, యుద్ధంలో గెలుపు, ఓటముల సందర్భాలలో దైవధర్మ ధ్వజవాహకులు నిర్వర్తించ

వలసిన తీరుతెన్నులు సయితం చర్చించబడ్డాయి. యుద్ధాల్లో యోధులకు ధైర్యం నూరిపోయడానికి, సత్యం, ధర్మం వారిపక్షాన ఉన్నప్పుడు యుద్ధంలో తెగించి పోరాడటానికి పురికొల్పడం సర్వసామాన్యమయిన విషయమే. అందునా, ముస్లిములు ప్రశాంతంగా తమ ధర్మాన్ని, ధార్మిక జీవన వ్యవస్థను, పరిపూర్ణంగా ఆచరించేందుకు అవకాశాన్నివ్వకుండా ఇస్లామ్ విరోధులు వారిని ఒక దాని తరువాత మరొకటి యుద్ధాలపరంపరలోకి ఈడుస్తున్నప్పుడు సత్యప్రియులకు మరో మార్గమేముంది?

**20. విశ్వసించినవారలారా, యూదులనూ క్రైస్తవులనూ మీ సహచర మిత్రులుగా చేసుకోకండి. వీరు వాస్తవానికి తమకు తామే నిజమయిన మిత్రులు. మీలో ఎవరయినా వీరిని తన మిత్రులుగా చేసుకున్నట్లయితే అతను కూడా వారిలోని ఒకనిగానే పరిగణించబడతాడు. నిస్సందేహంగా దుర్మార్గులయిన వారిని అల్లాహ్ తన మార్గ నిర్దేశనకు బహుదూరం చేసివేస్తాడు. (అల్ మాఇద : 51)**

ఆనాడు యుదులూ, క్రైస్తవులు అప్పుడప్పుడే సంఘటితమయి వ్యవస్థీకరిస్తున్న ముస్లిమ్ సముదాయం పట్ల విరోధంతో కుతకుతలాడుతున్నారు. కుట్రలు పన్ను తున్నారు, ఏకేశ్వరోపాసకులయిన ఈ వర్గాలవారు, గ్రంథవహులయిన వారు, బహుదైవారాధకులకు ఎదురుగా ప్రవక్తను సమర్థించడం, ఆయనకు సహకరించడం పోయి ఆయన మార్గంలో అన్యాయపరంగా కష్టాలు, కడగండ్లు సృష్టిస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో సహజంగా బాధితులయిన ముస్లిములు అమాయకంగా వ్యవహరించరాదని, ఆ పరిస్థితుల్లో మిత్రులెవరో శత్రులెవరో ఎరిగి మసలు కోవాలని హెచ్చరించడమే తప్ప ఇది సర్వసాధారణ మయిన ఆదేశం కాదు. దానికి తార్కాణం గ్రంథవహులకు ఇచ్చిన ఈ సర్వసాధారణ మయిన పిలుపు:

**గ్రంథవహులారా, మీకూ మాకూ మధ్య సమంగా వర్తించే ఒకమాట మీద సమాధానానికి రండి. అదేమిటంటే, మనం అల్లాహ్ వినా మరెవరినీ ఆరాధించరాదు, మరెవరినీ ఆయనకు సహవర్తులుగా**

**ఎంచరాదు. మనలో ఎవ్వరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తన ప్రభువుగా భావించరాదు. (ఆలి ఇమ్రాన్ : 64)**

21. **పోరాడండి; గ్రంథవహులలో అల్లాహ్‌నీ అంతిమ దినాన్నీ విశ్వసించని వారితో, అల్లాహ్, ఆయన సందేశహరుడు నిషిద్ధమని నిర్ణయించిన దాన్ని నిషిద్ధమయినదిగా పరిగణించని వారితో, సత్యధర్మాన్ని తమ ధర్మంగా స్వీకరించనివారితో, తమ చేజేతులా జిజ్‌యా సమర్పించుకుని అల్పు లయి మెలిగే వరకు ఎదురొడ్డి పోరాడండి. (అత్ తౌబా : 29)**

ఇప్పుడిప్పుడే స్థాపితమయిన ఇస్లామీయ రాజ్యానికి విరోధులుగా, తిరుగుబాటుదారులుగా తయారయిన వీరిని గురించి యుద్ధంలో లొంగదీయడం ఒక్కటే పరిష్కారం. వారు దైవ సందేశాన్ని, సత్యాన్ని స్వీకరించేందుకు మనస్ఫూర్తిగా ముందుకయినా రావాలి లేదా లొంగిపోయి రక్షణకు సంబం ధించిన పన్నునయినా చెల్లించాలి.

ఇస్లామీయ రాజ్యంలో నివసించే ముస్లిమేతర పౌరులు ఇష్టపడకపోతే దేశరక్షణలో (సైన్యంలో చేరి) పాలుపంచుకునే అవసరం లేదు. అయితే ఆ మినహాయింపునకుగాను వారు పన్ను చెల్లించాలి, అదే జిజ్‌యా. కాని వారు సైన్యంలో చేరదలిస్తే జిజ్‌యా చెల్లించ నవసరముండదు.

22. ఆయత్ పూర్తిగా ఇది :

**ఇదే విధంగా, "మేము 'నసారా'లము" అని ప్రకటించుకునే వారి చేతనూ మేము గట్టి ప్రమాణం చేయించుకున్నాము. కాని వారున్నూ తమకు నేర్పిన బోధనలో అధిక భాగాన్ని మరపునకు గురిచేశారు. కడకు ప్రళయం వరకు సాగే శత్రుత్వం, పరస్పర వైషమ్యం, విద్వేషాలను మేము వారిలో నాటాము. ఒకరోజు తప్పక రానున్నది, అప్పుడు అల్లాహ్ వారికి తెలుపుతాడు, వారు ప్రపంచంలో చేస్తూ ఉన్న కల్పనలేమిటో.**

**(అల్ మాఇద : 14)**

పూర్తి ఆయత్ చదివినట్లయితే అసలు విషయం బోధపడుతోంది. ఇది క్రైస్తవులకు సంబంధించిన విషయం. వారిలోని విభిన్న ముఠాల మధ్య వైరాన్ని ఇక్కడ ప్రస్తావించి ఇది ప్రళయం వరకు సమసిపోని విద్వేషం, వైషమ్యం అని చెప్పడం జరిగింది. వాస్తవంగా ఖుర్‌ఆన్ వెయిన్నర సంవత్సరాలకు పూర్వం పలికినట్లే నేటికీ క్రైస్తవుల విభిన్న ముఠాల మధ్య ఆ వైరం కొనసాగుతూనే ఉంది. ఏ ధార్మికవర్గమయినా సరే అసలు ధర్మాన్ని వదలి పెడతోవలు త్రొక్కి నప్పుడు సహజంగా సంభవించే పరిణామమే ఇది. క్రైస్తవుల మత గురువుల చేష్టలను గురించి దివ్యఖుర్‌ఆన్‌లో పలుచోట్ల వివరాలున్నాయి.

23. **వారు ఏ విధంగా తిరస్కారులయ్యారో అదే విధంగా మీరున్నూ తిరస్కారులవ్వాలని, మీరూ వారూ అంతా సమానమయిపోవాలని వారు కోరుకుంటున్నారు. అందువల్ల వారిలో ఎవ్వరినీ- వారు అల్లాహ్ మార్గంలో హిజ్రత్ (వలస) చేసి రానంత వరకు- మీకు మిత్రులుగా చేసుకోకండి. వారు దీనికి విముఖులయితే వారిని కానవచ్చిన చోటనే పట్టి సంహరించండి. వారిలో ఎవ్వరినీ మీ మిత్రునిగా సహాయకునిగా చేసుకోకండి. (అన్ నిసా : 89)**

ఇదీ యుద్ధకాలానికి సంబంధించిన ఆదేశమే. కపటులను గురించి దివ్యఖుర్‌ఆన్‌లో ఇతర చోట్ల కూడా జాగ్రత్త వహించాలని ముస్లిములకు బోధించడం జరిగింది. దీనికి ముందు ఆయత్‌లో తిరస్కారులు కపట ముస్లిములుగా ముస్లిమ్ సముదాయంలో ప్రవేశించి ముస్లిములను దారితప్పించడానికి చేసే ప్రయత్నాలను ప్రస్తావించడం జరిగింది. దీని తరువాతి ఆయత్‌లో వీరి ఏ వర్గం వారయితే ఒప్పందం చేసుకుని దాన్ని పాటించడానికి సిద్ధాంగా ఉన్నారో వారితో పోరాడటానికి వీలులేదని చెప్పడం జరిగింది.

24. **వారితో పోరాడండి; అల్లాహ్ వారికి మీచేత శిక్ష విధింపజేస్తాడు, వారిని పరాభవంపాలు చేస్తాడు. వారికి ప్రతిగా మీకు సహాయపడతాడు, విశ్వాసులనేకమంది గుండెలు చల్లబరుస్తాడు. (అత్ తౌబా: 14)**

లోగడ తెలిపినట్లు ఇస్లామీయ రాజ్యంపైన శత్రువుల ఆగడాలు ఎక్కువయి నప్పుడు విశ్వాసులకు ధైర్యం పలుకుతున్న సందర్భంలోని ఆయత్ ఇది.

ఈ ఇరువయి నాలుగు ఆయత్‌లను వాటి పూర్వాపరాల నుండి వేరుచేసి, వాటిలోనూ ఆయత్‌లోని కొంత భాగాన్నే తీసుకుని దానికి తమకు ఇష్టమయిన అపార్థాన్ని ఆపాదించి, అవి తమకు "బాధ" కలిగించాయని వాపోవడం, ప్రజల్లో విద్వేషాన్ని, వైషమ్యాన్ని సృష్టించేందుకు ప్రయత్నించడం ఎటువంటి "భారతీయ ప్రజ్ఞ"యో పాఠకులే నిర్ణయించాలని మనవి చేసుకుంటున్నాము. దివ్య ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేయదలచిన సోదరులు తొలుత "ఖుర్‌ఆన్ అవగాహనకు మూల సూత్రాలు" అనే చిరు పుస్తకాన్ని చదివి మరీ అధ్యయనం ప్రారంభిస్తే మంచిదని కోరుతున్నాము.

(ఈ చర్చ సందర్భంగా పేర్కొన్న అన్ని ఆయత్‌ల తెలుగు అనువాదం నేను ప్రస్తుతం అనువదిస్తున్న 'తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్' (ఖుర్‌ఆన్ అవగాహనం) నుండి గ్రహించబడినవని గుర్తించాలి. **- మలిక్**)